# వెలుగు....చీకట్లు ::

రచన :
''జ్ఞానశ్రీ''

ఎండ మండిపోతూంది...

శారదమ్మ గుండెకూడా మండిపోతూంది - ఎండా, ఎండతోబాటు శారదమ్మ గుండెకాయ ... రెండూ ఒక్కలాగే మండిపోతున్నాయి - వచ్చిన ఎండలు మండిపోతూనే వున్నాయి - వచ్చిన శారదమ్మ గుండె కూడా మండిపోతూనే వుంది...

మండిపోతూన్న యెండకీ...

మండుతూన్న శారదమ్మ గుండెకీ...,

తరతమ భేదం వుంది—.

వుందనుకూంటుంది శారదమ్మ—.

అదేమిటంటే???

ఎండమండిపోడం నిజం-

ఎండా, వానా, చలీ, అనే తాపత్రయం లేకుండానే శారదమ్మ గుండె మండుతూంటం అంతకన్నా నిజం—

ఎండ మండిపోతూంది...

మండిపోతూన్న యెండలో పోవలసి వుంది శారదమ్మ...

అసలు పోవలసిన అవసరం శారదమ్మే కన్పించుకున్నదేమో ?

ఎండలా మండుతూన్న శారదమ్మ గుండెకాయా... శారదమ్మ గుండెకాయకన్న ఎక్కువగా మండుతూన్న ఎండా...రెండూ రెండే -

ఎండ మండుతూందంటే కారణం వుంది వర్షం కోసం...

శారదమ్మ గుండె మండుతూందంటే దానికీ కారణం వుంది...ఆ కారణం చెప్పాలంటే అది అమ్మాయి... అబ్బాయి ... ప్రేమించుకోటం లాంటిది. అంతకన్నా వివరించాలంటే ... వాళ్ళేలా కాపరంచేసి ఎంతెంత శృంగారం దిగుమతి చేసిందీ పేరీజు వేసి తేల్చటం లాంటిది - ఇంతకన్నా యెక్కువ చెప్పాలంటే అది సెక్సునీతికి సంబంధించింది కాబట్టి ముందుగా పర్మిషన్ పుచ్చుకోవాలి ప్రభుత్వం దగ్గరనుంచి —-

అసలు శారదమ్మ యింత మండిపోతూన్న ఎండలోనూ నెత్తిమీద గొడుగు లేకుండానూ, కాళ్ళకు చెప్పులు లేకుండానూ, మాయకపోయినా మాసినట్టున్న నల్ల జాకట్టులోంచి ఆలేసు బాడీ కనిపిస్తూంటే...చెమటకి తడసిన తెల్లచీర మడతలక్రింద దోబూచు లాడుతూన్న అల్లికంచుల పొట్టిపరికిణీ మొర్రో మంటూంటే మెట్లు దిగుతూ అసహ్యపడింది... మెట్లెక్కి మీదనుంచి దిగటంకూడా అసహ్యమేమో ?

ఎండ మండిపోతూంది...

తారురోడ్డు పొగలు క్రక్కుతూంది—.

శారదమ్మ శరీరం చెమట పడుతూంది—

మండిపోతూన్న ఎండకి ... తట్టుకోలేక మెత్తపడ్డ తారురోడ్డు మీదనుంచి ... మండుతూన్న పాదాలను యింకా మండపెడుతూ ముందుకుపోతూన్న శారదమ్మ...శారదమ్మకన్నా ముందుకు పరుగెడుతూన్న తారు రోడ్డూ తప్పితే మరో నరప్రాణి కనిపించదు—

నుదిటిమీది చెమట బిందువులూ ... చెక్కిళ్ళమీది చిరుచెమటా ... సంయోగంపొంది ఆమెచేతిరుమాలు తాకిడికి వియోగంతో యేవ్యమాతున్నాయి—.

శారదమ్మ నడుస్తూంది...

శారదమ్మను నడిపిస్తూంది రోడ్డు—

ఒకానొకప్పుడు శారదమ్మ అందరి అమ్మాయిలాగే ఓ అబ్బాయిని ప్రేమించింది...ఛీ! ఛీ! ప్రేమించిందనే కన్న కామించిందందాం—.

ఆ అబ్బాయికూడా అందరబ్బాయిలకి మల్లే యీ అమ్మాయిని కామించేడు—

కామం కళ్ళు కప్పింది...

నరాలు పీకేయి...

శరీరాలు కలిసేయి...

ఆమె జడలోని పూలు రాలేయి—

అతడి మనసులోని వలపు వాడింది.

సంకేతాలు...అసంఖ్యాలయ్యేయి—

ఆమె జడలోని పూలు వాసన చూసేడతను...అతని గుండెమీది చిరుచెమటను ఆమె చెక్కిళ్ళకు అంటింది...

అతడి వడిలో ఆమె...

ఆమె వడిలో అతను...

అంతతో వాళ్ళసంబంధం తెగిపోయింది—

... అయితే ఒక్కటి...

ఆ అబ్బాయి మజ్నూ కాలేదు...

ఈ అమ్మాయి లైలా కాలేదు...

అడవులూ పుట్టలూ పట్టలేదు...

విరహ గీతాలు పాడుకోలేదు...

కథలలోని కాము జీవుల్లా ఆత్మహత్యలు చేసుకోలేదు...

జరిగిందేమిటంటే...

ఆ అబ్బాయికి ఆరువేలు కట్నంతో సలక్షణంగా పెండ్లికావటం ... అంతా చూస్తూండగానే యీ అమ్మాయి ఏభైయైదు రూపాయిల పంతులమ్మై ఊరు విడిచిపెట్టటం మామూలు జీవిత కథలాగే జరిగిపోయింది...

ఆ అబ్బాయి సంసారంలో పడి, యీ అమ్మాయిని మరిచిపోయేడు... ఈ అమ్మాయి ఉద్యోగధర్మంలోపడి ఆ అబ్బాయిని మరిచిపోయింది—

అబ్బాయి...మనిషియై...అందరిలాగే సంఘంలో చలామణీ పౌతున్నాడు...

పెళ్ళికాని శారదమ్మకూడా అందరి ఆడాళ్ళవు మల్లే ప్రజల్లోపడి తనుకూడా జీవయాత్ర సాగిస్తూంది...

కాలం జరుగుతూన్న కొద్దీ ... శారదమ్మతోకూడా మార్పురాగలిగింది...

మనసులో ఆ వేదన...

మగవాడికోసం ఆ రాధన...

ఆ వేదనకు అంతులేదు...

ఆరాటానికి వింతలేదు...

ఆరాధనకి నాథుడులేడు...

తనలో తెలియకుండానే యేదో మార్పు వచ్చేసింది...

ఆ మార్పుతోపాటు వేషంకూడా మారింది.

కాళ్ళకీ కాళ్ళ జోడుకీ...కండ్లకీ కండ్ల జోడుకీ ...

MPF

THE CHOICE - - - PENCILS

మెర్కురి బ్లాక్ లెడ్

ఇంపీరియల్ కాపీయింగ్

అకౌన్ టెంటు కలర్స్

కోరోమాన్ డల్ కలర్ కాపీయింగ్

చెక్కింగ్ కలర్స్

స్పెక్ట్రమ్ 12, కలర్లు (విద్యార్థులకు)

MPF No. 1100 SPECIAL HB MERCURY

"IMPERIAL" SUPERIOR ... HARD

MANUFACTURED BY

THE MADRAS PENCIL FACTORY

3, STRINGER STREET, MADRAS. I.

చీరకీ చీరలోని పరికిణీకీ ... జాకట్టుకీ జాకట్టులోని బాడీకీ... జోడు కుదిర్చింది...

ఎన్ని కుదిరిస్తే నేం...

తనుమాత్రం జోడు కుదుర్చుకో లేక పోయింది...

అసలు జోడు కుదుర్చుకోవాలనే యేవవున్నా... దానిగురించి యెంతగా ప్రయత్నించినా...ఆ విషయం వచ్చేసరికి ఆమెలోని ఉత్సాహం అమాంతం చల్లారి పోయేది—

దానికీ కారణంవుంది...

ఒక మేస్టరు తారసిల్లేడు —

మిస్త్రీ యెదురైంది...

ఒక కవి కైవసం చేసుకున్నాడు—

కళ్యాణం ఆవేసరికి కలవరపడిపోయేడు—

ఒక సబిన్స్పెక్టరు లాలించేడు—

పోలీసు పితలాటకం పెడతూడ కొట్టింది—

వ్యాపారస్తుణ్ని వరించింది—

వ్యభిచారం అంటకట్టబడింది...

హడలెత్తి పోయింది...

అంటకోసం వచ్చిన ఒంటరిగాళ్ళని తరిమికొట్టింది ...

కాలం జరుగుతూంది...

వేషం మారిపోయింది...

కాళ్ళకి జోడులేదు—

కండ్లకి జోడులేదు—

తల నెరసింది అక్కడక్కడ...

అయితే నేం...???

ఇన్నాళ్ళకు తన కెదురైందే సుఖస్వప్నం—

ఏభైయ్యో పడిలో పడిన వెంకటేశం యెదురయ్యేడు—.

తను నలభయ్యో పడిలో పడింది...

తన సంగతి అతనికి తెలుసు—

అతని సంగతి తనకు తెలుసు—.

సంఘంలో వెంకటేశం హీనుడయ్యేడు—

ఈమె పతితయ్యింది—

అందుకే నాళ్ళిద్దరూ కలిసేరు—.

పెళ్ళికి నిశ్చయించుకున్నారు—.

నిశ్చయం స్వచ్ఛందమైన యెండ సమయంలో— సరే నంది...

అయినా మనసు పీకుతూంది—:

ఆ ఆరాటాన్ని తలచుకుని తనలో తనే నవ్వుకుంది...

నవ్వుకుంటూ ... చెమట తుడుచుకుంటూ మండుతూన్న యెండలో ముందుకు నడుస్తూంది...

వెంకటేశం...

అసత్యం చెప్పడు...

బానిసత్వం భరించడు...

పంజరంలో పక్షి కాలేడు...

హీనతత్వానికి అంగీకరించడు...

దుఃఖాన్ని భరించలేడు...

అశాంతిని ఆహ్వానించలేడు—

తనుకూడా అంతే...

తన జీవితాన్ని తప్పుపట్టలేదు ... అతని జీవితాన్ని తనూ తప్పుపట్టలేదు...

ఆమె మనసులో ఆనందం వెలసింది...

మండుటెండ చిటపట లాడింది...

హృదయం తటతట లాడింది...

ఎండ మండిపోతూంది...

హోటల్సులోని రేడియోలు యుగళగీతాలు పాడుతున్నాయి—.

కిళ్లీ కొట్లలోని కార్కుసోడాలు కిరీటాల్ని కోల్పోతూ 'ఢంయ్' మంటున్నాయి—

శారదమ్మ ముందుకు పోతూంది—.

ఎప్పుడూ యెరుగని ఆనందం ఆమెలో ఆవరించింది...

జంటలు కండ్లలో మెరిసేయి—

మంటలు చల్లారేయి...

వంటరితనం విడిచిపోయింది—

వంటికివున్న పీడ వదిలింది—

అడుగులు తేలిపోతూంటే ... మనస్సు మధురంతో మదనపడుతూంటే ...నవ్యస్మృతులతో నవనవలాడుతూ ముందుకు నడుస్తూంది...

వెంకటేశం తనకోసం యెదురుచూస్తూంటాడు ... తను అతగాడితో మేళమాడుతూంది...నవ్వుతాడు ... లాలిస్తాడు...స్వీకరిస్తాడు...తలలోని పూలు పకుపుని ముద్దుపెట్టుకుంటాయి ... నడికప్పుని చూస్తూన్న తన

కళ్ళకి అతడికళ్ళు అడ్డువస్తాయి...కట్టుకున్న ఎర్రచీర తన మొలచుట్టూ హరివిల్లు విరుస్తూంది ... తను నలిగిన చీరని లేచి సర్దుకుంటుంది ... అతడు తృప్తితో లేచి హాయిగా నవ్వుతాడు...

ఇదంతా శారదమ్మ ఆలోచనే...

వెంకటేశం యిల్లుదగ్గర పడ్డాది...

హృదయం తహతహ లాడింది...

వెంకటేశం తల్లి యేడుస్తూంది...చుట్టూ మనుష్యులు కూర్చున్నారు - ఆమెను ఓదారుస్తున్నారు ... ఆ కూర్చున్న గుంపు మధ్య వెంకటేశం శవం...

శారదమ్మ గుండె ఆగిపోయింది...

ఆశ నిరాశైంది...

వెలుగు చీకటైంది...

శారదమ్మ కళ్లు చెమ్మగిల్లేయి...వెంకటేశం భౌతిక దేహానికి విషాదంతో చేతులెత్తి నమస్కరించి వెను తిరిగింది—.

వెలుగు వెలిగింది మెరుపులా—

చీకటి ఆవరించింది విషాదంలా—

ముందుకు నడిచింది...

నడిస్తేనేం—???

ఎండ మండిపోతూంది...

శారదమ్మ గుండెకూడా మండిపోతూంది...ఎండా... ఎండతోబాటు శారదమ్మ గుండెకాయ... రెండూ ఒక్కలాగే మండిపోతున్నాయి—

—అంతే.


కార్ఖానా యజమానులకు ఒక విన్నపము!!



మీ కార్ఖానాలకు కావలసిన



* WI. స్ప్లిట్ పుల్లీలు
* కాస్టైన్ పుల్లీలు
* V. రోప్ పుల్లీలను

ఉత్తమ రీతిగా తయారుచేస్తాము. వ్యవసాయదారులకు కావలసిన పెట్టెర్ ఇంజిన్ స్పేర్ పార్టులనూ G. E. పంపు సెట్టులను తయారుచేసి ఇవ్వబడును.

ఫోన్ 1011 జనరల్ ఇంజనీయరింగ్ కంపెనీ. తపాలుపెట్టె నెం. 257

సర్దారు పటేల్ రోడ్డు, కోయంబత్తూరు